
సాక్షి పల్నాడు

మంగళవారం ၊ 24 ၊ సెప్టెంబర్ ၊ 2024




సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 7427 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 1807 క్యూసెక్కులు వదిలారు.



సబ్‌జైలు సందర్శన

సత్తెనపల్లి: పట్టణంలోని సబ్‌జైలును గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార కమిటీ చైర్మన్ పార్థసారథి సోమవారం సందర్శించారు. రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 22,035 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. దిగువకు 36,950 క్యూసెక్కులు వదిలారు.

సమస్యల నిలయం గురుకులం

- చాలీచాలని భోజనం
- అడిగితే వేధింపులు
- గోడ దూకి సమీప కొండల్లోకి పారిపోయిన విద్యార్థులు
- జిల్లా యంత్రాంగం అప్రమత్తం
- క్షేమంగా వెనక్కి తీసుకొచ్చిన పోలీసులు
- సమస్యలు పరిష్కరిస్తామంటూ హామీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ నాగేశ్వరరావు

నాదెండ్ల: ''భోజనం బాగుండదు..తాగునీటి సౌకర్యం లేదు...మెనూ అమలు చేయరు..అదేమని అడిగితే చావబాదుతారు..అంతేకాదు మరుగుదొడ్లు కడిగిస్తున్నారు''...అంటూ యడ్లపాడు మండలం వంకాయలపాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వేధింపులు భరించలేక కొందరు విద్యార్థులు సోమవారం ఉదయం పాఠశాల గోడ దూకి సమీపంలోని కొండల్లోకి పారిపోయారు. అప్రమత్తమైన అధికారులు విద్యార్థులను తిరిగి వెనక్కి తీసుకొచ్చారు. కారణాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల మాటల్లోనే...



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ నాగేశ్వరరావు, జిల్లా కో ఆర్డినేటర్ పద్మజ

ఉపాధ్యాయుల మధ్య విభేదాలు

పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య విభేదాలు ఉన్నాయి. గ్రూపులుగా విడిపోయి విద్యార్థులను రెచ్చగొడుతున్నారు. వారి ప్రోద్భలంతోనే విద్యార్థులు గోడదూకి పారిపోయారు. త్వరలో ఉపాధ్యాయులందరినీ ఇతర పాఠశాలలకు బదిలీ చేసి కొత్త సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకుంటాం.

-పద్మజ, జిల్లా కో ఆర్డినేటర్

కలెక్టర్ దృష్టికి సమస్యలు

విద్యార్థుల సమస్యలు జిల్లా కలెక్టర్, సాంఘిక సంక్షేమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. పరిష్కారానికి కృషి చేస్తాం. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి.

-నాగేశ్వరరావు, డీఎస్పీ

భోజనం సరిగా ఉండదు



సోమవారం ఉదయం అల్పాహారంలో భాగంగా పులిహోర, చట్నీ పెట్టారు. పులిహోర బాగాలేదు. చట్నీ నీళ్లలా ఉంది. ప్రతి రోజూ భోజనం బాగుండదు. మెనూ ప్రకారం భోజనం పెట్టరు. తాగేందుకు కూడా పరిశుభ్రమైన నీరు అందుబాటులో ఉంచటం లేదు.

-బాలశౌరి, మహేష్, పదో తరగతి విద్యార్థులు

మరుగుదొడ్లు కడిగిస్తున్నారు



పాఠశాలలో స్వీపర్లు ఉన్నా తమతోనే మరుగుదొడ్లు కడిగిస్తున్నారు. పాఠశాల ఆవరణలో 80 మరుగుదొడ్లు ఉన్నాయి. 40 వినియోగంలో ఉన్నాయి. స్నానాలు చేసేందుకూ సరిపడా నీరు ఉండటం లేదు. ఆట వస్తువులు పాడైతే అందరిచేత డబ్బులు కట్టించుకుంటున్నారు. తిరిగి ఆ వస్తువును తీసుకురారు.

-జ్యోతికిరణ్, కమలరాజు, పదో తరగతి విద్యార్థులు

లోపలికి అనుమతించరు



ప్రిన్సిపల్ అనుమతి తీసుకుని మాత్రమే పాఠశాలలోకి వెళ్లాలి. ఆయన లేనపుడు మమ్మల్ని పాఠశాలకు రావొద్దంటారు. స్కూలులో సమస్యలపై ప్రస్తావిస్తే ప్రిన్సిపల్ ఏ మాత్రం పట్టించుకోరు. విద్యార్థుల బాగోగులపై ఆయనకు ఏ మాత్రం శ్రద్ధ లేదు. ఉపాధ్యాయులతోనూ ఆయన వ్యవహార్శైలి బాగుండదు.

-కట్టా వీరయ్య, పీఎంసీ వైస్ చైర్మన్

అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



జిల్లా కలెక్టర్‌కు అర్జీలు అందజేస్తున్న బాధితులు

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పరిష్కార వేదికకు అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి హాజరైన వారిచే 150 వినతులను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్ పాల్గొన్నారు.

రీ సర్వే, ఎల్పీ నంబర్లు రద్దు చేయాలి

రాష్ట్రంలో ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేసినప్పటికీ రైతుల సమస్యలు పరిష్కారం కాలేదని, అసలు సమస్య అయిన భూమి రీ-సర్వే, ఎల్పీ నెంబర్లు కూడా రద్దు చేయాలని ప్రజాసంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల వేదికలో సమస్యపై కలెక్టర్‌కు అర్జీ అందజేసిన నాయకులు అనంతరం మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు భూ రీ సర్వే, ఎల్పీ నంబర్లు ల్యాండ్ టైటిల్ యాక్టివ్ రద్దు చేస్తానని ప్రకటించి ఆచరణలో రైతులు పడుతున్న ఇబ్బందులు పట్టించుకోవట్లేదన్నారు. తమ భూమి తగ్గిందని రైతులు మొరపెట్టుకున్నా అధికారులు పెడచెవిన పెడుతున్నారన్నారు. తక్షణమే భూ సర్వే, ఎల్పీ నంబర్లు రద్దు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం తెలిపారని అన్నారు. పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, ఎంసీపీఐ జిల్లా అధ్యక్షుడు ఓర్సు కృష్ణ, రజక నాయకులు సురభి వెంకటేశ్వర్లు, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

రీ సర్వేలో స్థలం సైజు తగ్గించారు

నేను చిలకలూరిపేటరోడ్డులోని మాగం పుల్లారావు నగర్‌లో నాలుగు సెంట్ల భూమి కొన్నాను. అప్పుడు సర్వే చేయించి తీసుకున్నా. ఇటీవల జరిగిన రీ సర్వేలో నా భూమి గుండా రోడ్డును చూపించటంతో సెంటున్నర కోల్పోయాను. ఇప్పుడు సెంటు భూమి ధర రూ.12లక్షల వరకు ఉంది. మళ్లీ సర్వే చేయించి నా భూమి నాకు ఇప్పించండి.

-పంతంగి సుబ్బారావు, అరండల్‌పేట, నరసరావుపేట

ఆక్రమణలను నియంత్రించాలి

బరంపేటలోని చాకిరాల మిట్ట వద్ద రజకులకు కమ్యూనిటీ హాలు నిర్మాణం నిమిత్తం 40 సెంట్ల స్థలం ఇచ్చారు. దీనిలోని 12 సెంట్ల భూమిని రాంబాబు, రామారావు ఆక్రమించుకున్నారు. రేకుల షెడ్డు వేశారు. దీని విలువ సుమారు రూ.కోటి ఉంటుంది. వెంటనే షెడ్డును తొలగించి ఆ స్థలాన్ని కాపాడండి.

-బాదుగున్న శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, రజక సంఘ నాయకులు

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటి మట్టం సోమవారం 589.30 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 10,120, ఎడమకాలువకు 2,765, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 28,664, ఎస్‌ఎల్‌బీసీకి 1,800, వరదకాలువకు 600 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 43,949 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా అంతే నీటిని ఇక్కడ నుంచి విడుదల చేస్తున్నారు.

న్యూస్‌రీల్

కోటప్పకొండ ఆలయ ఈఓగా చంద్రశేఖరరావు

నరసరావుపేటరూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయ ఈఓగా డి. చంద్రశేఖరరావు నియమితులయ్యారు. నెల్లూరు జిల్లా మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయ ఈఓగా పనిచేస్తున్న చంద్రశేఖరరావు సాధారణ బదిలీల్లో భాగంగా కోటప్పకొండ ఆలయ ఈఓగా ప్రభుత్వం నియమించింది. ఇప్పటి వరకు కోటప్పకొండ ఈఓగా పనిచేస్తున్న ఎస్. శ్రీనివాసరెడ్డి అమరావతి ఆలయ ఈఓగా బదిలీ అయ్యారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు



నాదెండ్ల: యడ్లపాడు మండల పరిధిలోని చెంఘీజ్‌ఖాన్‌పేట-సంతపేట గ్రామాల మధ్య చిలకలూరిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టడంతో వైర్లు తెగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగటంతో సబ్‌స్టేషన్‌లో ట్రిప్ కావటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి పెను ప్రమాదం తప్పింది. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

రిజిస్ట్రార్ కార్యాలయంలో కలెక్టర్ తనిఖీలు

నరసరావుపేట: రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రకాష్‌నగర్‌లోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేసిన సూచన మేరకు కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌లు కూర్చొని విధులు నిర్వహించే పోడియం ప్రదేశం జడ్జి చాంబర్ లాగా ఉండకూడదనే నిబంధన అమలు చేశారా లేదా అనేది పరిశీలించారు. దీనిపై సబ్ రిజిస్ట్రార్‌లకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. పౌరులకు అందిస్తున్న సేవలు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో పి.సరోజిని, రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు డీటీసీగా సీతారామిరెడ్డి

పట్నంబజారు: గుంటూరు జిల్లా డీటీసీగా కె. సీతారామిరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. విజయవాడలో డీటీసీగా పనిచేస్తున్న ఆయన్ను గుంటూరుకు బదిలీ చేస్తూ ఆర్టీఏ అధికారులు ఆదేశాలు వెలువరించారు. ఇప్పటివరకు పనిచేసిన షేక్ కరీంను ఏలూరుకు బదిలీ చేసి జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా ఎన్.శివరామ ప్రసాద్‌ను నియమించారు.

దేవదాయశాఖ ఏసీ మాధవి బాధ్యతల స్వీకారం

పట్నంబజారు: దేవదాయ శాఖ గుంటూరు జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా గ్రంధి మాధవి నియమితులయ్యారు. తెనాలిలోని వైకుంఠపురం ఏసీగా పనిచేస్తున్న ఆమెను జిల్లా ఏసీగా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

యార్డుకు 49,763 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 49,763 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 45,672 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,800 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,800 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ. 17,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,500 నుంచి రూ. 18,600 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 22,242 బస్తాల నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

అర్జీల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం

- ఎస్పీ కంచి శ్రీనివాసరావు
- 89 ఫిర్యాదులు స్వీకరణ



ఎస్పీకి తమ సమస్య విన్నవించుకుంటున్న బాధితులు

నరసరావుపేట: కన్నపిల్లలే పొలం, బంగారం, నగదు కాజేసి ఇంటి నుంచి బయటకు గెంటేసి మళ్లీ ఇక్కడ కన్పిస్తే చంపుతామని బెదిరిస్తున్నారని ఓ వృద్ధ తల్లి ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు మొరపెట్టుకొని వాపోయింది. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా ఎస్పీ అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులచే ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు, మోసాలకు సంబంధించినవి 89 ఫిర్యాదులు ఉన్నాయి. వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.

ఆస్తి కాజేసి చంపుతామని బెదిరిస్తున్నారు

నా రెండో కుమార్తె, కుమారుడు నాకు తెలియకుండా ప్రభుత్వం డబ్బులు వేస్తున్నారంటూ మాయమాటలు చెప్పి సంతకాలు చేయించుకొని మూడెకరాల పొలం రాయించుకున్నారు. రైతు భరోసా డబ్బులు గురించి తెలుసుకునేందుకు పంచాయతీకి వెళ్లగా భూమి వారి పేరుపై మారినట్లు చెప్పారు. వారిని ప్రశ్నించగా నా దగ్గర ఉన్న రూ.30నగదు, ఐదు సవర్ల బంగారు కాశి కాయల దండను బలవంతంగా లాక్కొని ఇంటి నుంచి గెంటేశారు. మళ్లీ ఇక్కడ కనబడితే చంపుతామని బెదిరిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండి.

-కె.అనంతమ్మ, నెమలిపురి, రాజుపాలెం మండలం

ఉద్యోగం ఇప్పిస్తానని రూ.22లక్షలు తీసుకున్నాడు

నాకు పోలవరం ప్రాజెక్ట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని వెంకటేశ్వర్లు అనే వ్యక్తి రూ.22లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోవడంతో డబ్బులు ఇవ్వమని అడగగా, ఆ డబ్బులు అడిగావంటే నిన్ను, నీ కుటుంబాన్ని నరికి ఈ భూమి మీద లేకుండా చేస్తానని బెదిరిస్తున్నాడు. నాకు అతడి నుంచి రక్షణ కల్పించి నా డబ్బులు ఇప్పించండి.

-పొన్నపాటి సీతారామిరెడ్డి, లింగంగుంట్ల అగ్రహారం, నరసరావుపేట మండలం

మట్టి కోసం 'తమ్ముళ్ల' వివాదం



పోలీసు స్టేషన్ ఎదుట ఉన్న ట్రాక్టర్లు, పొక్లెయిన్

- రేణింగవరం ఊరచెరువులో మట్టిని తవ్వి తరలిస్తుండగా టీడీపీ నేత యల్లాల నాగిరెడ్డిని అడ్డుకున్న పోలీసులు
- పొక్లెయిన్, ట్రాక్టర్ పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- గ్రామానికి చెందిన మరో టీడీపీ నేత బోరెడ్డి బోబులరెడ్డి 300 ట్రాక్టర్లకు పైగా మట్టిని తరలిస్తే ఎందుకు అడ్డుకోలేదని ఎస్‌ఐని ప్రశ్నించిన నాగిరెడ్డి
- పోలీస్ స్టేషన్ ఎదుట పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం



పోలీసుస్టేషన్ ఎదుట పురుగు మందు తాగేందుకు యత్నిస్తున్న యల్లాల నాగిరెడ్డి (పసుపు చొక్కా)

జే.పంగులూరు: అధికార తెలుగుదేశం పార్టీలో ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరుకుంది. మండల పరిధిలోని రేణింగవరం గ్రామంలో ఎన్నికలకు ముందు అందరూ కలిసికట్టుగా పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతికొద్ది కాలంలోనే తెలుగు తమ్ముళ్లు రెండు వర్గాలుగా విడిపోయారు. గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు యల్లాల నాగిరెడ్డి తన అన్న ఇంటి నిర్మాణం పునాది కోసం సోమవారం గ్రామంలోని ఊరచెరువులో మట్టిని తీసేందుకు పొక్లెయిన్‌తో వెళ్లాడు. ఈక్రమంలో పోలీసులు, రెవెన్యు అధికారులు ఆ ప్రాంతం వద్దకు వెళ్లి చెరువు మట్టి తవ్వే పనులను అడ్డుకొన్నారు. పొక్లెయిన్, ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం

తాను ప్రారంభం నుంచి పార్టీలోనే ఉన్నానని, మట్టి తవ్వుతుంటే పనులు ఎలా ఆపుతారని ఎస్‌ఐని నాగిరెడ్డి ప్రశ్నించాడు. గత నాలుగు రోజుల నుంచి మరో వర్గానికి బోరెడ్డి బోబులరెడ్డికి సంబంధించిన వర్గం మట్టి తవ్వకాలు జరుపుతుంటే అప్పుడు మీకు కనపడలేదా అని ప్రశ్నించాడు. గత నాలుగు రోజుల్లో గ్రామంలో ఇంచుమించు 300 ట్రాక్టర్లకు పైనే బోరెడ్డి వర్గం మట్టి తవ్వకాలు చేస్తుంటే పోలీసులు అప్పుడు మీరు ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఒక వర్గానికి వత్తాసు పలుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఏళ్ల తరబడి పార్టీని అంటి పెట్టుకొని ఉన్న తమకు న్యాయం జరగడం లేదని, పూటకో పార్టీ మారే వారికే న్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈక్రమంలో పోలీస్ స్టేషన్ ఎదుట తన వెంట తెచ్చుకున్న పురుగుమందు డబ్బా మూత తీసి తాగే ప్రయత్నం చేశాడు. పోలీసులు, చుట్టు పక్కలవారు ఎంత నివారించినా కొంత మందు తాగేశాడు. వెంటనే నాగిరెడ్డిని అద్దంకి ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు తరలించారు.

నాగిరెడ్డికి ఏమైనా జరిగితే పోలీసులదే బాధ్యత

నా తమ్ముడు నాగిరెడ్డి పోలీసులు చెరువు వద్దకు వచ్చిన దగ్గర నుంచి ఎస్‌ఐకి చెబుతూనే ఉన్నాడు. నా వాహనాలు పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తే స్టేషన్ ముందే పురుగు మందు తాగి చనిపోతానని హెచ్చరించినా.. పోలీసులు పట్టించుకోలేదు. మొట్టమొదటి నుంచి పార్టీని అంటిపెట్టుకొని ఉన్న నా తమ్ముడికి పార్టీ అధికారంలోకి వచ్చిన విలువ లేకుండా చేస్తున్నారు. ఎన్నికల ముందు వరకు తన స్వలాభం కోసం వేరే పార్టీలో ఉండి, పూటకో పార్టీని మార్చే వారు ఇక్కడ పెత్తనం చేస్తున్నారు. నా తమ్ముడు నాగిరెడ్డికి ఏమైనా జరిగితే దానికి పోలీసులు బాధ్యత వహించాలి.

– యల్లాల ఓబుల్ రెడ్డి, నాగిరెడ్డి సోదరుడు

నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు..

నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయనే ఉద్దేశంతో మట్టి తవ్వకాలను అడ్డుకున్నాం. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– వినోద్‌బాబు, రేణింగవరం ఎస్‌ఐ

యూనివర్సిటీ ఏసీఈగా ఎన్.యోబు

ఏఎన్‌యూ: నాగార్జున విశ్వవిద్యాలయ ఏసీఈ (అదనపు పరీక్షల నియంత్రణధికారి)గా డెప్యూటీ రిజిస్ట్రార్ ఎన్ .యోబు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఉప కులపతి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం ఆయనకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా యోబు మాట్లాడుతూ తనను అదనపు పరీక్షల నియంత్రణ అధికారిగా నియమించిన యూనివర్సిటీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. పరీక్షలను పగడ్బందీగా నిర్వహించడంతో పాటు విద్యార్థులకు మంచి సేవలు అందిస్తానని చెప్పారు. యూనివర్సిటీ ఖ్యాతి ఇనుమడింపజేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. వికాస కార్యదర్శి కె. శ్రీనివాసరావు, జాయింట్ రిజిస్ట్రార్ సత్యవతి, ఉద్యోగులు భానుప్రసాద్, ఎన్. నాగేశ్వరరావు, జె. శ్రీనివాసరావు, వై. రాధాకృష్ణ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.



యోబుకు నియామక పత్రాలు అందజేస్తున్న వీసీ

దుర్గమ్మకు లక్ష్మీ కాసుల హారం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైఉన్న దుర్గమ్మకు గుంటూరుకు చెందిన భక్తులు 53 గ్రాముల బంగారంతో తయారుచేసిన లక్ష్మీ కాసుల హారాన్ని కానుకగా సమర్పించారు. గుంటూరు శ్రీనగర్‌కాలనీకి చెందిన కె.కిరణ్‌బాబు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి సోమవారం వచ్చింది. రూ.3.50 లక్షల విలువైన 53 గ్రాముల బంగారంతో తయారు చేయించిన లక్ష్మీకాసుల హారాన్ని ఆలయ అధికారులకు అందజేసింది.



దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈఈ కోటేశ్వరరావు

విశ్రాంత డీఎస్పీ ఇంటిలో భారీ చోరీ

- దొంగలు కారులో వచ్చి చోరీ చేసినట్లు గుర్తించిన పోలీసులు
- 28 సవర్ల బంగారం, రెండు వజ్రాల నెక్లెస్‌లు, ఏడు కిలోల వెండి అపహరణ



పెంచలనాయుడు కుటుంబ సభ్యుల నుంచి వివరాలను సేకరిస్తున్న వెస్ట్ డీఎస్పీ జయరాం

లక్ష్మీపురం: కారులో వచ్చి ఇద్దరు వ్యక్తులు విశ్రాంత డీఎస్పీ ఇంటి తలుపులు బద్దలు కొట్టి బీరువాలో ఉన్న బంగారం, వజ్రాల నెక్లెస్‌లు, వెండి వస్తువులు చోరీ చేశారు. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున జరిగినట్టు తెలుస్తోంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరులోని చంద్రమౌళీనగర్ 6/1ఎ లైన్‌లో దొంగలు కారులో నుంచి దిగి తొలుత కృష్ణా రెసిడెన్సీ అపార్టుమెంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. వాచ్‌మన్ మెలకువగా ఉండటాన్ని గమనించి దాని ఎదురుగా ఉన్న లీలా హోమ్స్ అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లి రెక్కీ నిర్వహించారు. మొదటి అంతస్తులో విశ్రాంత డీఎస్పీ పెంచలనాయుడు ఇంటికి తాళం వేసి ఉన్నట్లు గుర్తించారు. ఆయన శనివారం కుటుంబ సభ్యులతో నెల్లూరు వెళ్లారు. ఇద్దరు దొంగలు ఇంటి ప్రధాన తలుపు తాళాలు పగలగొట్టి లోపలకు చొరబడ్డారు. బీరువాలో ఉన్న బంగారం, వజ్రాల నెక్లెస్‌లు, వెండి వస్తువులను చోరీ చేసి తిరిగి అదే కారులో పరారయ్యారు. ఉదయం వాచ్‌మన్ మొదటి అంతస్తులోకి వెళ్లిన సమయంలో తలుపులు పగలగొట్టి ఉన్నట్లు గమనించాడు. విశ్రాంత డీఎస్పీకి సమాచారం తెలియజేశారు. ఆయన ఈ విషయాన్ని పట్టాభిపురం పోలీసులకు, వెస్ట్ డీఎస్పీ జయరాంప్రసాద్‌కు తెలిపారు. డీఎస్పీ, పట్టాభిపురం ఎస్‌ఐ రాంబాబు, సీసీఎస్ సీఐ వెంకన్న చౌదరి, సీసీఎస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ చేరుకుని కీలకమైన ఆధారాలను సేకరించాయి. అక్కడ ఉన్న సీసీ కెమెరాలను డీఎస్పీ పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు కారులో నుంచి దిగి కృష్ణా రెసిడెన్సీలో గమనించి, ఆ తరువాత లీలా హోమ్స్‌లోకి వెళ్లినట్లు గుర్తించారు. విశ్రాంత డీఎస్పీ పెంచలనాయుడు కుటుంబ సభ్యులతో సాయంత్రం 4 గంటలకు అపార్టుమెంట్‌కు చేరుకున్నారు. బీరువాలో ఉన్న 28 సవర్ల బంగారం, ఏడు కేజీల వెండి, రెండు వజ్రాల నెక్లెస్‌లు చోరీ అయినట్లు ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

డ్రాగా ముగిసిన సెంట్రల్, నార్త్‌జోన్ మ్యాచ్

నార్త్ జోన్‌కు 8, సెంట్రల్ జోన్‌కు 6 పాయింట్లు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో ఏసీఏ ఇంటర్ జోన్ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్, నార్త్ జోన్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించిన నార్త్ జోన్‌కు 8, సెంట్రల్ జోన్‌కు ఆరు పాయింట్లు లభించాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్ తన తొలి ఇన్నింగ్స్‌లో 188 పరుగులు చేయగా, నార్త్ జోన్ రెండు వికెట్ల నష్టానికి 85 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో సోమవారం బ్యాటింగ్‌కు దిగి తొమ్మిది వికెట్లు నష్టానికి 193 పరుగులు చేసింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన సెంట్రల్ జోన్ ఎనిమిది వికెట్లు నష్టానికి 188 పరుగులు చేసింది. జట్టులోని జీవీఎస్ సుమిత్ 50, జీఎస్ స్వామి 56 పరుగులు సాధించారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నార్త్ జోన్ ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా తొమ్మిది పరుగులు చేసింది. అంపైర్లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్. సీతాపతిరావు మ్యాచ్‌ను పర్యవేక్షించారు.

ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలకు కేఎల్‌యూ విద్యార్థులు


ఉమా మహేష్


ముఖేష్

తాడేపల్లి రూరల్: పెరు దేశంలోని లిమాలో ఈ నెల 26 నుంచి అక్టోబర్ 6 వరకు జరగనున్న జూనియర్ ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించేందుకు కేఎల్‌యూ విద్యార్థులు నేలవల్లి ముఖేష్, మద్దినేని ఉమా మహేష్‌లు ఎంపికయ్యారని వర్సిటీ క్రీడల అసోసియేట్ డీన్ కె. హరికిశోర్ తెలిపారు. సోమవారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఇటీవల ఈ పోటీలలో పాల్గొనే భారత జట్టును ప్రకటించిందని చెప్పారు. ఇందులో తమ విద్యార్థులు నేలవల్లి ముఖేష్, మద్దినేని ఉమా మహేష్ ఉన్నట్లు తెలిపారు. ముఖేష్ సీఎస్ ఐటీ మూడో సంవత్సరం , ఉమా మహేష్ 4వ సంవత్సరం చదువుతున్నాడని పేర్కొన్నారు. వీరిద్దరూ ఒలింపిక్ పతక విజేత గగన్ నారంగ్‌కు చెందిన గన్‌ఫర్ గ్లోరీ షూటింగ్ అకాడమీలో అంతర్జాతీయ కోచ్‌లతో పాటు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శిక్షకుల పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ పొందుతున్నారని తెలిపారు. విద్యార్థులకు వర్సిటీ వీసీ జి. పార్థసారథివర్మ, ప్రో వైస్‌చాన్సలర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, రిజిస్ట్రార్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ కె.ఆర్.ఎస్. ప్రసాద్, క్రీడల అసోసియేట్ డీన్ కె.హరికిశోర్, వ్యాయామ అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

వరద బాధితులకు వైఎస్సార్ సీపీ నాయకుల ఆపన్నహస్తం



పార్టీ కార్యాలయంలో వరద బాధితుల సహాయాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డికి అందజేస్తున్న నాయకులు

బియ్యం, కందిపప్పు, వంటనూనె, దుప్పట్లు అందజేత

నరసరావుపేట: విజయవాడ వరద బాధితుల సహాయార్థం మేము సైతం అంటూ వైఎస్సార్ సీపీ నాయకులు కదిలారు. తమ వంతు సహకారంగా అందజేస్తున్న వాటిని సోమవారం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి అందజేశారు. సీనియర్ నాయకులు షేక్ ఖాజావలి మాష్టారు, 33వార్డు నాయకుడు మర్రిపూడి రాంబాబు, బొమ్ము కృష్ణారెడ్డి, తిన్నలూరి వాసు, కుప్పాల శ్రీను, ఆళ్ల చిన్నశ్రీను, మణికంఠరెడ్డి, విజయ్‌రెడ్డి కందిపప్పు, దుప్పట్లు, వంటనూనె అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, మండల ఉపాధ్యక్షుడు వెంకటప్పారెడ్డి, కొండకావూరు, అల్లూరివారిపాలెం సర్పంచ్‌లు వెన్నపూస నాగిరెడ్డి, భవనం నర్సిరెడ్డి, రంగారెడ్డిపాలెం, పెట్లూరివారిపాలెం, ఉప్పలపాడు గ్రామ నాయకులు మూరే రవీంద్రారెడ్డి, మూరబోయిన శ్రీనివాసరావు, యన్నం రాధాకృష్ణారెడ్డి అందజేశారు. హాలీవుడ్ రఘురామిరెడ్డి సోదరులు 100 కిలోల వంటనూనె అందజేశారు. కొనకంచివారిపాలెం నాయకులు పోనుగోటి వెంకటరావు రెండు క్వింటాళ్ల బియ్యం అందజేశారు. రెండు, మూడు, 30వ వార్డు నాయకులు షేక్ శిలార్‌బాష, చిన్న బుజ్జి, తిప్పరయ్య, షేక్ రెహమాన్ నిత్యావసర సరుకులు అందజేశారు.

నేడు విజయవాడకు...

వరద బాధితులకు నిత్యావసర వస్తువులు, దుస్తులు పంపిణీ చేసేందుకు మంగళవారం మధ్యాహ్నం స్థానిక గుంటూరు రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి విజయవాడకు బయలుదేరుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ నాయకులు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, మాజీ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లు, పట్టణ వార్డు ఇన్‌చార్జీలు, కార్యకర్తలు, మహిళా అభిమానులు అందరూ గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్దకు రావాలని కోరారు.

వీఆర్‌ఏలకు పే స్కేలు అమలు చేయాలి

వీఆర్‌ఏల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ బందగి సాహెబ్


మాట్లాడుతున్న వీఆర్‌ఏల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు బందగి సాహెబ్

సత్తెనపల్లి: వీఆర్‌ఏలు అందరికీ పే స్కేలు అమలు చేయాలని, అర్హత ఉన్న వీఆర్‌ఏలు అందరికీ వీఆర్వోలుగా పదోన్నతులు ఇవ్వాలని వీఆర్‌ఏల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి సీఐటీయూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సహాయకుల జిల్లా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనందరాజు అధ్యక్షత వహించారు. బందగి సాహెబ్ మాట్లాడుతూ నామినీ లుగా పనిచేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా నియమించాలని, నైట్ వాచ్‌మన్, అటెండర్ డ్యూటీలను రద్దు చేయాలన్నారు. 2005 వీఆర్‌ఏ సర్వీసు రూల్స్ ప్రకారం వీఆర్‌ఏలను ఉపయోగించుకోవాలన్నారు. అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా మూడు రెవెన్యూ డివిజన్లలో ఖాళీగా అటెండర్ పోస్టులు చాలా ఉన్నాయని, వాటిని వెంటనే వీఆర్‌ఏల చేత భర్తీ చేయించాలన్నారు. సమావేశంలో వీఆర్‌ఏల సంఘం గౌరవ అధ్యక్షురాలు మల్లేశ్వరి, అమరావతి మండల అధ్యక్షుడు రాజు, సత్తెనపల్లి మండల అధ్యక్షుడు రవి, ప్రధానకార్యదర్శి మునాఫ్, ఉపాధ్యక్షుడు బ్రహ్మయ్య, బెల్లంకొండ ప్రధాన కార్యదర్శి శ్రీను సాహెబ్, దుర్గి మండల అధ్యక్షుడు వెంకటేష్, రెంటచింతల మండల నాయకులు కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో డెంగీ వ్యాధిని నివారించవచ్చు

జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్


లక్కరాజుగార్లపాడులో ఆరోగ్య కార్యకర్తలకు సూచనలు చేస్తున్న డీఎంఓ

సత్తెనపల్లి: ముందస్తు జాగ్రత్తలతో డెంగీ వ్యాధిని నివారించవచ్చని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ అన్నారు. సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడు గ్రామంలో దోమల నివారణ చర్యలను సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డీఎంఓ మాట్లాడుతూ ప్రజలు దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ముందస్తు జాగ్రత్తలతో దోమల ద్వారా వ్యాప్తి చెందే డెంగీ, చికున్ గున్యా, మలేరియా, బోదవ్యాధి, మెదడువాపు వ్యాధులను నివారించవచ్చన్నారు. వారాని కి ఒకసారి నీటి నిల్వలను తొలగించి ఆరబెట్టి మరలా నీరు పట్టుకోవాలని, ఫ్రై డే ఫ్రై డే పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలందరూ దోమతెరలు వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి రూరల్ సబ్ యూనిట్ ఆఫీసర్ షేక్ సుభాన్‌బేగ్, ఆరోగ్య విస్తరణ అధికారి పిట్టల శ్రీనివాసరావు, ఆరోగ్య పర్యవేక్షకురాలు జే.సంపూర్ణదేవి, ఎంఎల్‌హెచ్‌పీ సురేష్‌కుమార్, ఆరోగ్య కార్యకర్తలు పి.మేరీరాణి, పి నాగేశ్వరరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

27న చదరంగం పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలల్లోని విద్యార్థినులు, విద్యార్థులకు క్రీడా పోటీలు, జిల్లా జట్లకు క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ కార్యదర్శి జి.నరసింహారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న అమరావతిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలల చెస్, అక్టోబర్ 3న చిలకలూరిపేటలోని ఏఎంజీ కళాశాలలో నెట్‌బాల్, జూడో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. పోటీల ఎంపికల్లో పాల్గొనే విద్యార్థులు విధిగా టెన్త్ మార్కుల జాబితా కాపీపై సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ సంతకంతో హాజరుకావాలని ఆయన సూచించారు.

గుంటూరు జిల్లాలో తేలికపాటి వర్షం

కొరిటిపాడు(గుంటూరు): జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు ఎనిమిది మండలాల్లో తేలికపాటి వర్షం పడింది. ప్రత్తిపాడు మండలంలో 11 మిల్లీ మీటర్లు, పెదనందిపాడు 8.4, మంగళగిరి 5, తెనాలి 3, పొన్నూరు 1.8, కాకుమాను 1.2, చేబ్రోలు 1, గుంటూరు పశ్చిమలో 0.8 మి.మీ. చొప్పున వర్షం పడింది.

నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంటులో చోరీ

మంగళగిరి: నగర పరిధిలో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంటులో చోరీ జరిగింది. రూరల్ సీఐ శ్రీనివాసరావు సోమవారం తెలిపిన వివరాల మేరకు.. చినకాకానిలో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో ఆదివారం రాత్రి దొంగలు చొరబడి కార్యాలయం అద్దాలు పగలకొట్టారు. కౌంటర్‌లోని రూ. 70వేలతో పాటు రూ. 2.50లక్షల విలువైన విద్యుత్ వైరుని దొంగలించారు. భవన యజమాని నేరేళ్ల మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ తెలిపారు.

దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ


ట్రైసైకిల్స్ పంపిణీ చేస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యే చదలవాడ, కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట రూరల్: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కేంద్ర సామాజిక న్యాయం సాధికారత సంస్థ, ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో వికలాంగులకు ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీ సోమవారం మార్కెట్ యార్డ్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఎంపీ లావు మాట్లాడుతూ దివ్యంగుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. 709 మందికి రూ.1.5 కోట్ల వ్యయంతో ఉపకరణాలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. తన ఎంపీ నిధులతో 193 బ్యాటరీ ట్రైసైకిల్స్‌ను రూ.32.81 లక్షలతో అర్హులైన దివ్యాంగులకు అందజేస్తున్నట్టు తెలిపారు. అలింకో సంస్థ నుంచి రూ.1.18 కోట్ల వ్యయంతో 861 ఉపకరణాలను 516 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ గొనుగుంట్ల కోటేశ్వరరావు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్‌చార్జీలు విడుదల చేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల డిమాండ్



కలెక్టర్ కార్యాలయంలో ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు ముగిసినా విద్యారంగంలోని సమస్యలకు పరిష్కారం లభించలేదని, వెంటనే సమస్యలు పరిష్కారం చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా కన్వీనర్ కోట సాయికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో జిల్లా కమిటీ నాయకులతో కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని చెప్పి నేడు కనీసం పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. రాష్ట్రంలో డిగ్రీ కళాశాలలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ విధానం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆన్‌లైన్ అడ్మిషన్ ప్రక్రియను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కళాశాలలో పీజీ చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో నెంబర్ 77 తక్షణమే రద్దు చేయాలని కోరారు. ఇంటర్మీడియట్ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పథకం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులు చదువుకునేటువంటి సంక్షేమ హాస్టల్లో నేడు సంక్షేమానికి దూరంగా ఉంటున్నాయని అన్నారు. సంక్షేమ హాస్టళ్లకు పూర్తిస్థాయిలో భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత ఏడు నెలల నుంచి మెస్ ఛార్జీలు ఇవ్వడం లేదని, తక్షణమే మెస్ ఛార్జీలు విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జిలు పెంచాలని డిమాండ్ చేశారు. ఎయిడెడ్ విద్యాసంస్థలను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 35, 36, 42లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మెడికల్ కాలేజీలకు ప్రైవేట్ పరం చేయడం కోసం వేసే అడుగులను తక్షణమే ఆపాలని, పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు డి.అమూల్య, రోహిత్, షాదుల్లా, ఫణి, యాసిన్, సత్తి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింపజేయాలి

ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి


సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

బెల్లంకొండ: ప్రకృతి వ్యవసాయ విధానాన్ని గ్రామాలలో విస్తరింపజేసి, అధిక శాతం మంది రైతులు సాగు చేపట్టేలా అవగాహన కల్పించాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల గ్రామ సమైక్య ప్రతినిధులకు, బుక్ కీపర్స్‌కి ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి సంఘంలో ప్రకృతి వ్యవసాయం అజెండాగా పెట్టి ప్రతి సభ్యురాలు ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా చూడాలని, అంతేకాకుండా ప్రతి సభ్యురాలు వారి ఇంటి ఆవరణలో పెరటి తోటలు పెంచుకోవాలని సూచించారు. పేదరికంలో ఉన్న కుటుంబాలను అభివృద్ధి పథంలోకి తీసుకురావాలంటే ప్రకృతి వ్యవసాయం ఒకటే సరైన మార్గమని అన్నారు. ప్రతి కుటుంబం వారి వార్షిక ఆదాయంలో 60 శాతం ఆరోగ్యం పైనే ఖర్చు పెడుతుందని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన విష రహిత, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను తినడం ద్వారా వారి ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పలు రకాల పంటల విధానం ఆచరించడం ద్వారా భూమి సారవంతం అవుతుందని, పంటలకు చీడపీడల ఉధృతి తక్కువగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజు, సైదయ్య, పవన్‌కుమార్, మౌనిక, మండల సమైక్య అధ్యక్షురాలు హాజరబి, ఎంటీలు అనంతలక్ష్మి, జయలక్ష్మి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత

తాడేపల్లి రూరల్: రాష్ట్రవ్యాప్తంగా వరదల వల్ల పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేసి, ప్రకటించిన సుఖీభవ పథకం కింద రూ. 20 వేలను ఖాతాలో వేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రాజధాని రైతు సంఘ నేతలు, రైతులతో ఆయన ధర్నాను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత నెల భారీగా కురిసిన వర్షాలు, కృష్ణా, గోదావరితో పాటు పలు నదులు, వాగులు, వంకలు, చెరువు కట్టలు తెగి రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వారందరినీ ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి నివాసముంటున్న తాడేపల్లి మండలంలోని చిర్రావూరులో గేదెలు, వరిగడ్డి వాములు కొట్టుకుపోయాయని, వారిని కూడా గుర్తించి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వరి పంట ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య, ఉద్యాన పంటలకు లక్ష రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. విత్తనాలు ఉచితంగా అందించాలని, ఎరువులు, పశువుల గడ్డి సబ్సిడీపై ఇవ్వాలని తెలిపారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

రూ.3.41 లక్షలు విలువ చేసే వస్తువులు స్వాధీనం


నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు

అద్దంకి: పలు దేవస్థానాల్లో, ఎవరూ లేని ఇళ్లల్లో చోరీలు చేసే దొంగను పట్టుకొని పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. సోమవారం అద్దంకి – నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారిలోని కొంగపాడు డొంకవద్ద నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ కృష్ణయ్య చెప్పారు. సీఐ వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట గ్రామానికి చెందిన తన్నీరు మధు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అయితే చెడు వ్యసనాలకు బానిసైన ఇతను కూలి పనులతో వచ్చే డబ్బులు సరిపోక దొంగతనాలకు అలవాటు పడ్డాడు. దాదాపు 20 సంవత్సరాల నుంచి మార్టూరు, జె.పంగులూరు, మద్దిపాడు, సంతమాగులూరు, ఒంగోలు, కనిగిరి, ఇంకొల్లు, బల్లికురవ, చీమకుర్తి పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు దేవస్థానాలు, ఇళ్లల్లో రాత్రిళ్లు దొంగతనాలు చేస్తుండేవాడు. ఈ క్రమంలో ఆయా స్టేషన్లలో నిందితుడిపై కేసులు నమోదై ఉన్నట్లు సీఐ చెప్పారు. నిందితుడి నుంచి రూ.3.41 లక్షల విలువ కలిగిన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ పర్యవేక్షణలో బృందంగా ఏర్పడి నిందితుడిని పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. ఈసందర్భంగా వారిని ఆయన అభినందించారు.

తత్వశాస్త్ర ఉద్దండుడు కొత్త సచ్చిదానందమూర్తి


నేడు తెనాలిలో శత జయంతి సభ, పుస్తకావిష్కరణ


ఆచార్య సచ్చిదానందమూర్తి

తెనాలి: భారత జాతి గర్వించదగిన గొప్ప తత్వవేత్తల్లో ఒకరు ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి. ఆయన భారతీయ తత్వశాస్త్రాన్ని విశ్వవ్యాప్తం చేశారు. తన మేధస్సు, రచనలతో వచ్చిన గుర్తింపుతో విదేశాల్లో ఎన్నో పదవులు వరించినా, మన సంస్కృతిపై మమకారంతో ఇక్కడే స్థిరపడ్డారు. దేశవిదేశాల్నుంచి ఎన్నో గౌరవాలను అందుకున్నారు. తనకిష్టమైన అధ్యయనం, గ్రంథరచనలో గడిపారు. తత్వశాస్త్రాన్ని సామాన్యులకు సైతం చేరువ చేశారు. తెనాలి ఇంప్రెషన్స్, వివేక ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త నిర్వహణలో ఆచార్య మూర్తి శతజయంతి సభ, పుస్తకావిష్కరణను మంగళవారం తెనాలిలో నిర్వహించనున్నారు.

తెనాలి గడ్డ బిడ్డ

తెనాలికి సమీపంలోని సంగంజాగర్లమూడి సచ్చిదానందమూర్తి స్వస్థలం. 1924 సెప్టెంబరు 25న సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. స్వయంకృషి, సాధన, జిజ్ఞాసతో తాత్విక వాఙ్మయాన్ని ఔపోసన పట్టారు. సంస్కృత భాషాధ్యయనం చేస్తూనే, పన్నెండేళ్లకే హిందీ విశారద పట్టా పొందారు. పదిహేనేళ్లకే తెలుగులో భగవద్గీతకు వ్యాఖ్యానం రాశారు. తత్వశాస్త్రంలో ఉద్దండులైన శైలేశ్వ రసేన్, పీటీరాజుల వద్ద అధ్యయనం చేసి, పట్టభద్రులయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఆనర్స్ డిగ్రీ చేశారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర కళాశాల, మయూర్ ఖంజ్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేశారు.


2001లో రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ నుంచి పద్మవిభూషణ్ అవార్డు అందుకుంటున్న సచ్చిదానందమూర్తి

1949లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రవేశం

1949లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్ర అధ్యాపకుడిగా చేరారు. అనతికాలంలో ఆ విభాగం అధ్యక్షుడిగా, ప్రొఫెసర్‌గా పదోన్నతిని పొందారు. పదవీ విరమణ వరకు అక్కడే కొనసాగారు. 1975–78లో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా పనిచేశారు. 1986–80 మధ్య యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు. అమెరికా, బ్రిటన్, చైనా, థాయ్‌లాండ్, జపాన్, మంగోలియా, బర్మా వంటి పలు దేశాల్లోని పలు విశ్వవిద్యాలయాలకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా చేశారు. 1968లో పాట్నాలో జరిగిన భారతీయ తత్వశాస్త్ర సభకు ఆయన అధ్యక్షత వహించారు. 1980–94 మధ్య ఇండియన్ ఫిలసాఫికల్ కాంగ్రెస్‌కు అధ్యక్షుడిగా వ్యవహరించారు. సారనాథ్‌లో విశ్వవిద్యాలయ స్థాయిలో గల 'సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టిబెటన్ స్టడీస్'కు 1985 నుంచి చాన్సలర్ హోదాతో సమానమైన అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించారు.

ఆఫ్రో ఏషియన్ ఫిలాసఫీలపై గ్రంథ రచన

భారత నాగరికత, చరిత్ర, హిందూ ధర్మశాస్త్రాలు, ఆఫ్రో ఏషియన్ ఫిలాసఫీలపై ఇంగ్లిష్‌లో 30పైగా, తెలుగులో 12పైగా గ్రంథాలను ఆచార్య మూర్తి రచించారు. 'రివిలేషన్ ఇన్ అద్వైత వేదాంత' గ్రంథం మతాలకు సంబంధించిన తత్వాలపై మహోన్నతమైనదిగా గుర్తింపు పొందింది. 'ద ఇండియన్ స్పిరిట్' అనే పుస్తకంతో భారతీయ సంస్కృతిలోని అపోహల్ని తొలగించారు. ఈ దేశ సంస్కృతిని విమర్శించేవారికి గట్టి సమాధానం చెప్పారు. ఆచార్య మూర్తి రాసిన 'వేదార్థ మీమాంస' మరో గొప్ప సాహసం అంటారు. వేదాలపై గల భయాన్నీ, భ్రమలను తొలగించే ప్రయత్నమది. వేదాలను దైవీకరణ నుంచి తప్పించి, మానవీకరణ విశ్లేషణలతో సాగిన పుస్తకం ఇది. సామాన్యులకు కూడా వేదాన్ని అర్థం చేసుకోవడంపై ఆసక్తిని కలిగించింది. స్త్రీలకు, నిమ్నవర్గాలకు వేదంలో సముచిత స్థానం లేదనే వ్యతిరేక భావలను ఈ పుస్తకం భగ్నం చేసిందనీ చెబుతారు.

నాగార్జున విశ్వవిద్యాలయం స్థల ఎంపికలో చొరవ

ఆంధ్ర విశ్వవిద్యాలయంకు అనుబంధంగా గుంటూరులో పీజీ సెంటర్ ప్రారంభించినపుడు ఆచార్య మూర్తి కొంత కాలం స్పెషలాఫీసర్‌గా పనిచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కళాశాలలు ప్రారంభించాలనే ప్రతిపాదన వచ్చినపుడు ఆయన నేతృత్వంలోని కమిటీ వాటిని పరిశీలించి చేసిన సిఫార్సులపై పలుచోట్ల డిగ్రీ కళాశాలలు వచ్చాయి. ఈ పీజీ సెంటరే 1976లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంగా రూపుదిద్దుకుంది. స్థలం ఎంపిక, తదితర అంశాల్లోనూ ఆయన చొరవ చూపించారు. ఆయన కృషి ఫలితంగా నాగార్జున విశ్వవిద్యాలయంలో రూ.30 లక్షల వ్యయంతో 'ఆఫ్రో ఏషియన్ తత్వశాస్త్ర అధ్యయన సంస్థ'ను ఏర్పాటుచేశారు.

పలు విశ్వ విద్యాలయాల నుంచి డాక్టరేట్లు

ఆచార్య మూర్తి కృషికి గుర్తింపుగా దేశంలోని తొమ్మిది విశ్వవిద్యాలయాల నుంచి డాక్టరేట్లు, రెండు ప్రతిష్టాత్మక సంస్కృత పీఠాల నుంచి గౌరవ మహామహోపాధ్యాయ బిరుదలతోపాటు అనేక ప్రభుత్వ సంస్థల నుంచి అవార్డులు వచ్చాయి. తత్వశాస్త్రంలో గల ఒకే ఒక అవార్డు 'బీసీ రాయ్ అవార్డు'ను తొలిసారిగా ఆచార్య మూర్తి అందుకున్నారు. భారత ప్రభుత్వం నుంచి 'పద్మభూషణ్' (1984), 'పద్మవిభూషణ్' (2001) గౌరవాలను స్వీకరించారు. 2007లో ఇండియన్ కౌన్సిల్ ఫర్ ఫిలసాఫికల్ రీసెర్చ్ రజతోత్సవం సందర్భంగా జీవితకాల సాఫల్య పురస్కారంతో సత్కరించారు. ఇలా తాత్వికరంగంలో ఎవరూ పొందలేని గౌరవాన్ని డాక్టర్ మూర్తి అందుకున్నారు. విశ్రాంత జీవితాన్ని సొంతూరులోనే గడుపుతూ 2011 జనవరి 24న కన్నుమూశారు.

రేపు ప్రత్యేక పోస్టల్ కవర్ ఆవిష్కరణ

ఏఎన్‌యూ: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి శత జయంతి ఉత్సవాలను ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహిస్తున్నామని సెంటర్ డైరెక్టర్ ఆచార్య ఎం. త్రిమూర్తిరావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 25న ఆయన పేరుతో కంగా పోస్టల్ కవర్‌ను ఆవిష్కరించనున్నామని పేర్కొన్నారు.